# సత్య వాక్య

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

ఇంగ్లీషు THE VOICE OF TRUTH

సోమవారము
బుధవారము } 9-00 to 9-15 p. m.

హిందీ — SATYA SUSAMACHAR

మంగళవారము
గురువారము
శుక్రవారము } 9-00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము
శుక్రవారము } 6-45 to 7-00 p. m.

మళయాళం — THE VOICE OF TRUTH

మంగళవారము
శుక్రవారము } 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI**
P.O. Box. 80
KAKINADA - 533 001

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **2** సెప్టెంబరు **1982** సంపుటి **3**


## సంపాదకీయము

### తప్పెవరిది? మానవునిదా, ప్రభువు మార్గానిదా?

### *( Who is at Fault – The Lord's Plan or Man ? )*

క్రైస్తవుడగుటను గూర్చి గాని, క్రీస్తుసంఘాన్ని గూర్చి గాని మన మెవరితోనైనా మాట్లాడుచున్నప్పుడు అతడు తొట్రిల్లిన క్రైస్తవు నొకని మాదిరిగ తీసికొని క్రైస్తవ్య మేమిటో, క్రీస్తుసంఘం ఏమిటి కాదో తెలియ జేయుటకు ప్రయత్నించును. దేవునికి అవిధేయులై యున్నందుకు, సంఘాన్ని దూషించుటకు మనందరిని ఒక సాకుగ అతడు వినియోగించును. అయితే యిట్టివారెల్లప్పుడు అపనమ్మకముగా యున్న వానినే ఎందుకు వినియోగిస్తారు? నమ్మకముగా యున్న క్రైస్తవులు పెక్కుమంది కూడ ఉన్నారుగదా. అయితే వారున్న పరిస్థితిలోనే యుండుటకు యిట్టివారు సాకులను వెదకుచున్నారు. అందువలన తొట్రిల్లిన క్రైస్తవుని ఒక అడ్డు బండగా వారు వినియోగించుదురు.

ఒకనికి సహాయం అవుసరమైనప్పుడు సంఘము ఒక్కొక్కసారి అతనికి సహాయం చేయలేకపోవచ్చు. సహాయం చేయకుండుటలో సంఘము రైటు కావచ్చు. సహాయంపొందే అర్హత అతనికి లేకపోవచ్చు. సంఘంలో డబ్బు ఉండకపోవచ్చు. అయితే కొందరు అనుకొన్నరీతిగా సంఘ సహోదరులు చేయనందున, వారు ప్రభువు ప్రజలలో తప్పును కనుగొందురు. ఒక్కొక్కసారి ఇటువంటి విషయాల్లో సంఘ సభ్యుడే సంఘాన్ని వదలివేయును.

ఒక సహోదరుడు విశ్వాసములో క్రొత్తవాడు కావచ్చును, స్వల్ప బైబిలు జ్ఞానం కలిగి యుండవచ్చు, తాను చెప్పాలనుకొన్నది సరిగ చెప్పడం చేతకాకపోవచ్చు. అయినను యితరులకు అతడు సువార్త బోధించా లనుకొంటాడు. అతనికి ఉన్న ఆసక్తి యెక్కువ. అయితే బోధించకముందు అతడు మంచిగా సిద్ధపడుట అవుసరం. యిది జరుగనప్పుడు అతడు అసత్యాన్ని బోధించే అవకాశం ఉన్నది. అతడు విచక్షణచేసి చెప్ప లేనందున ఆత్మలను రక్షించుట మాని వారిని పారద్రోలినవాడగును. ఉదాహరణకు, అతడు బండగా మాటలాడ వచ్చు. తన ప్రసంగానికి ఫలితం కనబడకపోతే కోపోద్రేకుడు కావచ్చు. ప్రజలు తక్షణమే అతని ప్రసంగానికి లోబడకపోతే వారినందరినీ నరకానికి అతడు పంపేయవచ్చును. ఇట్టి వ్యక్తులవలన ప్రభువు నుండి సంఘము నుండి పారద్రోలబడిన కొంతమందితో నేను సంభాషించాను. నేను ఓపికతోను, ప్రేమతోను, దయతోను ప్రభువు రక్షణ మార్గమును వారికి బోధించినప్పుడు వారు సువార్తకు లోబడి నేటి వరకు నమ్మకమైన క్రైస్తవులుగా యున్నారు. యించుమించు ఆ ముందు చెప్పబడిన బోధకుని మాటలనే నేను చెప్పాను. గాని ఆ మాటలను నేను చెప్పిన రీతిలో భేదమున్నది. మనం జాగ్రత్త వహించని యెడల ప్రజలను సంఘ శత్రువులుగా తయారుచేసే ప్రమాదం ఉన్నది.

ఒక్కోసారి సత్యాన్ని తెలిసికొనుటకుగాక, మనం యిచ్చే జవాబులో కేవలం తప్పు పట్టుకొనుటకొరకు ప్రశ్నలు వేయవచ్చు. ఉదాహరణకు, చనిపోయిన తమ తలిదండ్రులు క్రీస్తు సంఘసభ్యులు కాదు. వారు నశింతురా? యని కొందరు తెలిసికొన గోరుదురు. వారు మంచివారు, ఒక డినామినేషన్‌లో సభ్యులు అయితే చనిపోకముందు క్రీస్తుసంఘాన్ని గూర్చి వారికేమీ తెలియదని వారు వివరింతురు. యేసుక్రీస్తు కాలంలో కూడ యిటువంటి ప్రశ్నల నడిగిన వారున్నారని మనం జ్ఞాపకం తెచ్చుకొనవలెను. వారు సత్యాన్ని అన్వేషించుటలేదు. గాని ఆయనను విమర్శించడానికి అవకాశాన్ని వెదుకుచుండిరి. ఆయన అట్టి సందర్భాలను చాల సమర్థవంతముగా వినియోగించాడు. ఆయనే వారినొక ప్రశ్న అడిగేవాడు. ఆయన అడిగిన దానికి వారు జవాబిస్తే, వారడిగిన దానికి ఆయన జవాబిస్తాడు. ఆ సమస్య అక్కడితో అంతమయ్యేది. అయితే నేను తీర్పు తీర్చేవానిని కానని ఎల్లప్పుడు వివరింతును. నేను వారిని నరకానికిగాని, పరలోకానికిగాని పంపించలేనని కూడ చెబుతాను. అందువలన వారిపై కడవరి తీర్పు తీర్చుట కేవలం అసందర్భానుసార మగును. దేవుడు నీతి యథార్థతలుగల తీర్పరి యని మనం యెరుగుదుము. గనుక ఆ సమస్యను ఆయనే పరిష్కరించును. తరువాత, ప్రస్తుతం మనం మృతులైన వారి తలిదండ్రులను గూర్చి గాక వారిని గూర్చి ఆసక్తిని కలిగి యున్నామని నేను వారికి చెప్పి, వారు రక్షింపబడుట కేమి చేయాలని దేవుడు చెప్పెనో దానిని నేనెరుగుదునని తెలియ జేయుదును. వారి తలిదండ్రులు గనుక జీవించి యుంటే, నిజమైన సంఘమును గూర్చి తెలిసికొనే అవకాశం వారికి దొరికితే వారు తప్పక సువార్తకు లోబడుదురని కూడ వారికి తెలియ జేయుదును. దేవుని చిత్తాన్ని నిరాకరించుచు తమ్మును తాము నీతిమంతులముగా కనబడుటకు ప్రజలు వెదికే మార్గాలను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

సంఘములో అనేక వేషధారు లున్నారని అంటే నటించేవారు, అపనమ్మకముగా యున్నవారు అనేకులున్నారని చెప్పుచు క్రీస్తు సంఘ సభ్యులు కాకుండ యున్నవా రెందరున్నారో చెప్పలేము. అయితే ప్రశ్న యేమంటే, ఈ ప్రజలు వేషధారులతో ఎక్కడ జీవించాలి? లోకములోనా? సంఘములోనా? ఈ జీవితంలోనా? రాబోవు జీవితంలోనా? వాస్తవానికి ఎక్కడో ఒకచోట వేషధారులతో జీవించాలిగదా. అపవాదితోను వాని దూతలతోను నరకంలో నిత్యము జీవించుటకంటే సంఘములో వేషధారులతో జీవించుటయే మంచిదని నా ఉద్దేశ్యము. వేషధారులను గూర్చి కొంతమంది సాకులు చెప్పుచునే యుందురు. వారు వెదికేది కేవలం సాకులనే.

ప్రభువు చెప్పినట్లు చేయడానికి వచ్చేసరికి సంఘములో యున్న వారు, బయట నున్నవారు కూడ రకరకాలైన దోషములను వెదకుచు యుందురని నీవు గమనించ గలవు. "నేను క్రీస్తులోను ఆయన బోధలోను దోషమున్నదని చెప్పడంలేదు. గాని రక్షింపబడి పరలోకానికి వెళ్లుటకు క్రీస్తు సంఘసభ్యుడై యుండనవసరం లేదని నేననుకొనుచున్నాను" అని కొందరు చెప్పుచుందురు. నీవు అపొ. కా. 9వ అధ్యాయమును చూస్తే దానిలో సౌలు మార్పు జెందిన సందర్భాన్ని చూడగలవు. అతడు క్రీస్తు సంఘాన్ని అంటే క్రైస్తవులను ఘోరముగా హింసించినట్లు చూడగలవు. ప్రభు వతనికి కనబడినప్పుడు ప్రభువా నీ వెవరవని అతడు అడుగగా ఆయన, "నేను నీవు హింసించుచున్న యేసును" అని జవాబిచ్చెను. అతడు క్రీస్తు సంఘమును నిరాకరించిన యెడల, క్రీస్తును ఆయన చిత్తాన్ని నిరాకరించినట్లగునని ఆయన అతనికి తెలియజేసెను. నీవు ప్రభువు ప్రజలను అంటే ఆయన సంఘమును హింసించునపుడు నీవు క్రీస్తును ఆయన మార్గమును ఎదుర్కొనుచున్నావు. నీవు క్రీస్తు సంఘములో తప్పును వెదకుచున్నపుడు, క్రీస్తే దానిని స్థాపించెను గనుక నిజానికి ఆయనలో తప్పును వెదుకుచున్నావు

(మత్తయి 16:18). ఆయన తప్పు చేసాడా? క్రీస్తు స్థాపించిన దానిని నిరాకరించి నీవు ఆయనను సంతోషపెట్టగలనని యనుకొనుచున్నావా? నీవనుకొన్నట్లు యెవరో చేయలేకపోయినందున నీ ఇష్టంవచ్చినట్లు ప్రవర్తింప వచ్చుననుకొనుచున్నావా? నీ యవుసరాన్నిగాని, మరింకొకరి అవుసరాన్నిగాని సంఘము తీర్చలేనందున సంఘమంతటిని నీవు దూషించ వచ్చునా? సంఘములో కొందరు వేషధారు లుండినందున దానిలో నీవు సభ్యుడవు కాకుండుటకు ప్రభువు నీకు అనుమతి నిచ్చు ననుకొనుచున్నావా?

మనం గ్రహించవలసిన దేమంటే, ప్రభువు మార్గమే పరిపూర్ణమైనది. మానవుడు అపరిపూర్ణుడు. మన సమస్య యేమంటే పరిపూర్ణుడైన క్రీస్తును వదలి అపరిపూర్ణుడైన మానవుని మనం తిలకించుచున్నాము. క్రీస్తును, ఆయన మార్గాన్ని ఒకసారి చూద్దాం: క్రీస్తు పాపములేని జీవితాన్ని జీవించి మనం రక్షింపబడేటట్లు సిలువపై చనిపోయెను (హెబ్రీ 4:15; గలతీ 1:4). తన చిత్తాన్ని బయలుపరచు నిమిత్తం దేవుడాయనద్వారా మాటలాడెను (మత్త 17:5). అందువలన మానవుని పరిపూర్ణుని చేయుటకు దైవావేశమువలన కలిగిన లేఖనములు సర్వ సంపూర్ణములు (2 తిమో 3 : 16, 17). లేఖనములలో మనము సంఘము నెవరు స్థాపించిరో (మత్తయి 16:18), అది ఎక్కడ స్థాపింపబడెనో (అపొ. కా. 2), దాని పునాదిని గూర్చి (1 కొరింథీ 3:11), ప్రాముఖ్యత (అపొ. కా. 5:23-25) దాని శిరస్సు (కొలస్స 1:18), దాని పేరు (రోమా 16:16) మొదలగు వాటిని గూర్చి చదువగలము. ఇదంతయు పరిపూర్ణమైనది. దేవుని నారాధించుటకు క్రైస్తవు లేమిచేయవలెనో కూడ లేఖనములు మనకు తెలియజేయుచున్నవి (యోహాను 4:24). వారు ఆదివారమున కూడుకొనవలెను (అపొ. కా. 20 : 7); కూడుకొని దేవుని వాక్య పఠనము (2 తిమో 2:15), ప్రార్థన (అపొ. కా. 2:42), దేవునికి స్తుతి గీతములు

పాడుట (ఎఫెసీ 5:19), ప్రభు రాత్రి భోజనములో పాలు పొందుట (1 కొరింథి 11), కానుక లిచ్చుట (1 కొరింథి 16 : 2) చేయవలెను. ఇదంతయు బైబిలు చేయు ఉపదేశమును బట్టి యున్నది. ప్రభువు ఇచ్చిన రీతిగనే దానిని ఉంచవలెను. చివరిగా, క్రైస్తవ జీవనము గూర్చి లేఖనములు మనకు బోధించుచున్నవి (లూకా 9:23; 1 పేతురు 2:21; కొలస్స 3:17). ఆయనను వెంబడించిన యెడల కలుగు బహుమానమును గూర్చి కూడ లేఖనములు బోధించుచున్నవి (మత్తయి 6:33; ప్రకటన 2:10). దీనితో సహా దేవుడిచ్చిన దంతయు పరిపూర్ణమైనది గనుక దానిని మనం మార్చరాదు. అది ఉన్న రీతిగనే దానిని మనము ఉంచవలెను. ప్రభువు కోరేది అది. దానిని మనం అభివృద్ధి పరచలేము.

రెండవదిగా, యిప్పుడు మనము మానవుని, లేక సంఘములో మానవుని పక్షాన్ని చూద్దాం. ప్రభువు మార్గము పరిపూర్ణమైనదయినను, మానవుడు పరిపూర్ణుడు కాడు. అందువలన మానవుడు క్రీస్తు బోధను బట్టి నడువ ప్రయత్నించునపుడు ఒక్కొక్కసారి అతడు విఫలుడగును, అన్ని విషయములలోను ప్రభువు యొక్క కాంక్షకు లోపించినవాడగును. మానవుడు చేయదగిన దానికంటె ఎక్కువను ఆయన అడుగడు గనుక రక్షింప బడవలెనంటే అతడు ప్రయత్నించుచు యుండవలెను. ఉదాహరణకు సంఘము యొక్క నమూనా పరిపూర్ణమైనది గాని క్రీస్తు బోధకు లోబడిన అపరిపూర్ణులైన మానవులతో సంఘము తయారు చేయబడింది. సంఘము మానవులతో సమకూడింది గనుక దానిలో మానవ లక్షణములుండును. కొందరు నమ్మకముగా యుండవచ్చును, కొందరు ఉండకపోవచ్చును. కొందరు నిష్కపటులై సమర్పించుకొన వచ్చును. మరికొందరు వేషధారులు కావచ్చును. ఉపదేశించువారి యెడల కొందరు మంచి మనస్తత్వము కలిగి యుండవచ్చును. మరికొందరు కోపిష్టులై, అసహ్యముగా ప్రవర్తింప

వచ్చును. తద్వారా చాల హాని చేయవచ్చును. సంఘము తనకు తాను నిర్ణయించుకొనుటకు ప్రభువు స్వేచ్ఛ నిచ్చిన విషయాల్లో అది ఒక్కో సారి కావలసిన రీతిగ నిర్ణయించక పోవచ్చును. అయితే అది ఎల్ల ప్పుడు శాయశక్తులా ప్రయత్నించి పనిచేయ వలెను.

ప్రభువు తన చిత్తాన్ని మన కిచ్చాడని, మనం దానిని విశ్వ సించి దానికి లోబడాలని ఆయన కోరుచున్నాడని మనం గ్రహించ వలెను. అది మన కిష్టమైనదో లేదో అడుగుటకు ఆయన ఎంచుకో లేదు, దానిలో దేనినయినా ఉంచడానికి మన సెలవు ఆయన కోర లేదు. మనము దానిని గూర్చి సణుగవచ్చు, దానిలో లోపముల నెంచవచ్చు, నిరాకరించ వచ్చుగాని అది మాత్రం అట్లాగే యుండును. సంఘాన్ని గూర్చి కూడ మనం అట్లాగే చేయవచ్చు గాని అది అలాగే యుండును. అది ప్రభువుకు చెందును. ఆయన దాని రక్షకుడై యున్నాడు. గనుక రక్షింపబడాలంటే మనము దానిలో సభ్యులమై యుండాలి. అది మనకు యిష్టం కాకపోవచ్చు. దానిని మనం ఎదిరించి పోరాడవచ్చు గాని సత్యము సత్యమే. ఆ సత్యము శరీరమైన సంఘము నకు క్రీస్తు రక్షకుడని చెప్పుచున్నది. అట్లయినప్పుడు నీవు నేను రక్షింప బడాలంటే దానిలో సభ్యులమై యుండాలి. నిజానికి ఒకడు సువార్తకు లోబడినప్పుడు రక్షింపబడి సంఘముతో ప్రభువుచే చేర్చబడునని మనకు చెప్పబడింది (మార్కు 16 : 16; అపొ. కా. 20:7). మరల, బాప్తిస్మము పొందుటకు ఒకనికి యిష్టముండక పోవచ్చు. బాప్తిస్మము పొందకుండగనే రక్షింపబడితినని అతడు అనుకొనవచ్చును. విశ్వా సము ఒక్కటి మాత్రమే రక్షించునని అతడు వాదించవచ్చు. బాప్తిస్మ మును గూర్చియే గాక ప్రభువు యిచ్చిన ఆజ్ఞలను గూర్చి అత డనేక ములు చెప్పవచ్చును. అవన్నియు చెప్పిన తరువాత కూడ అతడు మానవ మాత్రుడే. ప్రభు వేమి చెప్పెనో వాటి దగ్గర అతడెందుకును పనికిరాడు. మానవు డేమి చెప్పినను సరే క్రీస్తే రైటు. గనుక ఒకడు

ఏమైన చెప్పకముందు ప్రభువేమి చెప్పెనో తెలిసికొనుటలో జ్ఞానుడగును. ఈ దిగువ వచనములను నీకు నీవే చదువుకొనుము: మార్కు 16:16; అపొ. కా. 2:38; 1 పేతురు 3:21; రోమా 6:3, 4; అపొ.కా. 8. మరల, ఒకడు రక్షింపబడి పరలోకానికి వెళ్ళవలెనంటే అతడు అన్ని విషయములలోను ప్రభువుకు లోబడవలెను (హెబ్రీ 5:8, 9; ప్రకటన 22:14). ఆయన మార్గమే పరిపూర్ణమైనది. గాని ఆయనకు లోబడువాడు మానవుడు గనుక అతడు తప్పులు చేయుచుండును. అందువలననే అతనికి ఒక రక్షకుడవుసరం, అతడు రక్షింప బడుటకు ఆయనకు లోబడుట అవుసరం.

నీవు సంఘమును గూర్చి మరింకోదానిని గూర్చి ఏదైనా నిర్ణయించుకోక ముందు దేవుని వాక్యము ఏమి చెప్పుచున్నదో నీవు చూడవలెనని నిన్ను ప్రోత్సహించ గోరుచున్నాను. సంఘములో మానవుని పక్షాన్ని నీవు పదేపదే చూచుటవలన దానిని బట్టి దేవుని పక్షాన్ని నీవు చూడలేకపోయే ప్రమాదం ఉన్నది. నీ యాత్మను గూర్చి నీవాలోచించుకొనవలెనని నిన్ను కోరుచున్నాను. యితరులు ఏమిచేసినను, చేయుచున్నను, చేయకపోయినను సరే, నీ యాత్మ రక్షింపబడాలంటే నీవు దేవునికి లోబడుట అత్యవసరం. వారి యొక్క బలహీనతలు, అపజయాలనుబట్టి ప్రభువుకు లోబడకుండ నీవుండి నీ యాత్మను నశింపజేసికోకు. ఎవరో చేసిన దానినిబట్టి గాక నీవు చేసిన దానిని బట్టియే ఒక దినమందు ప్రభువు నీకు తీర్పు తీర్చును.

దేవుని పరిపూర్ణ మార్గమయిన సత్యవాక్యము మనము చదువుకొనునట్లు, దానికి లోబడునట్లు మన కున్నది. నీవట్లు చేయవలెనని నిన్ను కోరుచున్నాను. సువార్తను గూర్చి, సంఘమును గూర్చి, క్రైస్తవ జీవితమును గూర్చి, రాబోవు జీవితాన్ని గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో పరిశోధింపుము. ప్రభువు నిన్నేమి కోరుచున్నాడో తెలిసికొనుము. నీవు తెలిసికొని ఆయనకు లోబడితే ప్రభువు నిన్ను దీవించును.

★

# నిత్య జీవమనగా నేమి?

అది యూదయ ప్రాంతం. యేసు శిష్యులు గలిలయనుండి అప్పుడే వచ్చారు. చాలమంది ప్రజలు ఆయనను వెంబడించారు. ప్రభువు యెరూషలేము వైపుగా వెళుతున్నట్లుంది. ఎవరో దూరాన పరుగెత్తుకుంటూ వస్తున్న జాడ కనుపిస్తుంది. ఆయావనుడు ప్రభువు దగ్గర మోకాళ్లూనాడు. ఏదో తెలిసికోవాలనే ఉత్కంఠ అతని ముఖంలో స్పష్టంగా కనుపిస్తుంది. "బోధకుడా! నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెను"—ప్రశ్నించాడు ప్రభువును. సంభాషణ కొనసాగినది. క్రీస్తు అతని మీద జాలిపడి నిత్యజీవమును స్వతంత్రించుకొను విధానాన్ని బయలు పరచాడు. ఆమాట యీ ధనికునికి బాధకలిగించింది. నిరాశతో ఇంటిముఖంపట్టాడు (మత్తయి 19:16-22; మార్కు 10:17-27; లూకా 18:18-25).

క్రీస్తు మాట యౌవనునికి బాధ కలిగించుటకు కారణం—అతని ధనం! అంతేకాదు; క్రీస్తు వ్యక్తపరచిన భావంలో నిత్యజీవం వేరు. ధనికుని ఆలోచనలో వున్న నిత్య జీవం వేరు. అందరూ అనుకునేటట్టుగా నిత్యజీవం అంటే నిరంతరం జీవించడం అని అతడు భావించి వుంటాడు. నరకంలోను నిత్యమూ వుంటారు సాతాను, వాని దూతలు మరియు అవిధేయులు. అది నిత్యజీవం కాదు గదా! కాబట్టి నిత్యజీవము అను మాటలో కేవలం నిరంతరం జీవించియుండుట మాత్రమేగాక అందిమిడి యున్న పూర్తి యర్థమును గ్రహించవలెను.

**నిత్య జీవమను మాట భావము :**

"జీవము" అను పదం "ZOE" అను ఆదిమ భాషకు అనువాదం. ఇది మానవుడు తలంచినట్టు భౌతికమైన ఊపిరి కాదు. దేవుడు కలిగి యున్న జీవమువంటి జీవము. అసలు జీవము శాశ్వతం; వాస్తవికం. "ప్రాణము" అను పదము "PSUCHE" అను గ్రీకు పదము నుండి

వచ్చినది. రక్తప్రసరణ కొనసాగునపుడు, గుండె, ఊపిరితిత్తులు పని చేయునపుడు భౌతిక దేహంలో వుండే ఆయువు. జీవం వేరు, ప్రాణం వేరు.

యేసుక్రీస్తు జీవము అను మాటకు అసలైన నిర్వచనం. ఆయన జీవించిన విధానమే జీవమార్గం. ఆయన గుణము, స్వభావము, వ్యక్తిత్వము జీవము అను మాటకు ప్రతీకలు. తండ్రియొద్ద నుండి ప్రత్యక్షమయిన నిత్యజీవము ఆయనే (1 యోహాను 1:1-2). ఆయనలో జీవముండెను; ఆజీవము మనుష్యులకు వెలుగై యుండెను(యోహాను 1:4). ఆయన మాటలు జీవజలం (యోహాను 4:10-14). ఆయన తండ్రివలె తనంతట తానే జీవముగలవాడు (యోహాను 5:26). ఆయన మనకు జీవాహారము (యోహాను 6:35). ఆయన చెప్పిన మాటలు ఆత్మయు జీవమునై యున్నవి (యోహాను 6 : 63). మనకు క్రీస్తు జీవము (కొలస్సి 3:4) క్రీస్తే మార్గము. సత్యము జీవము (యోహాను 14:6).

యేసు వ్యక్తిత్వంలో జీవము అంటే ఏమిటో తెలుసుకోగలము క్రీస్తు స్వభావ లక్షణములే జీవ నియమములుగా మన కొరకు వ్రాయబడినవి. క్రీస్తు జీవన విధానమే క్రొత్తనిబంధన మార్గం. తానేది బోధించెనో అదే క్రీస్తు జీవించెను. యేసు భువిలో నివసించిన భౌతిక జీవితం బహు స్వల్పం. కాని ఆయన మాటలలో, క్రియలలో, అనుదిన జీవితంలో జీవము సమృద్ధిగా ప్రవహించింది.

## జీవముపొందుట యెట్లు ?

లోకమునందు మరణము ప్రభుత్వము చేయుచున్నది (రోమా 5:14). పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). ఇట్టి మరణములో మానవుడు దేవుని నుండి వేరై భ్రష్టజీవితమును కొనసాగించుచున్నాడు (ఎఫెసీ 2:1-3; 4 : 17-22). దేవునివలన కలుగు జీవము నుండి వేరైనవారు వ్యర్థతకు, అపవిత్రతకు, కాముకత్వమునకు, దురాశలకు బానిసలు. భౌతికంగా బ్రతికినా ఆత్మీయముగా జీవము లేనట్టే.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. మనము నిత్యజీవము పొందునట్లు తన కుమారుని మనకు బహూకరించెను (యోహాను 3:16). కలువరి సిలువలో బలియైన యేసు తన పాత్ర నిర్వహించెను (యోహాను 3:14-15). దేవుని కుమారునియందు విశ్వాసముంచి నిత్యజీవము పొందుట మానవుని విధి. అంతే కాదు; ఆయనమాట విని, తండ్రి యందు విశ్వాస ముంచవలెను. అట్టివాడు తీర్పులోనికి రాక, మరణములో నుండి జీవములోనికి దాటి యున్నాడు (యోహాను 5:24).

క్రీస్తు మరణసమాధి, పునరుత్థానములలో పాలుపొంది మనము జీవము పొందితిమి (రోమా 6:3-11). శరీరమూలముగా జన్మించినది శరీరమును, ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునై యున్నది (యోహాను 3:6). క్రీస్తు నామమందు విశ్వాస ముంచినవారు ఆయన మూలముగా జన్మించుదురు (యోహాను 1:12-13). నూతన జన్మ ద్వారా దేవుని కృపా బాహుళ్యము, నీతి పొంది జీవములో ప్రవేశించ గలము (రోమా 5:17).

దేవుని మూలముగా పుట్టిన వానిలో ఆయన బీజము నిలుచును. గనుక వాడు పాపము చేయజాలడు. అనగా మరణములో కొనసాగు నట్లు పాపములో కొనసాగడు (1 యోహాను 3:9). యేసు లోకము నకు వెలుగు; ఆయనను వెంబడించువాడు జీవపు వెలుగు కలిగియుం డును (యోహాను 8:12). దేవుడు మనకు నిత్యజీవము దయచేసెను. ఈ జీవము ఆయన కుమారునియం దున్నది. దేవుని కుమారుని అంగీక రించువాడు జీవముగలవాడు; కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడు (1 యోహాను 5:11-12).

అద్వితీయ సత్య దేవుని, ఆయన పంపిన యేసుక్రీస్తును ఎరుగు టయే నిత్యజీవము (యోహాను 17:3). ప్రియులారా! మనము ఒకని నొకడు ప్రేమింతము. ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగు చున్నది. ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగ పుట్టినవాడై

దేవుని ఎరుగును (1 యోహాను 4:7). మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నామని ఎరుగుదుము. ప్రేమ లేనివాడు మరణమందు నిలిచి యున్నాడు. తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు. ఏ నరహంతకుని యందును నిత్యజీవ ముండదని మీరెరుగుదురు (1 యోహాను 3:14-15).

క్రీస్తుకు సాతానుకు భేదమెంతో, జీవమునకు మరణమునకు అంత భేదముంది. పగ, ద్వేషం, ఈర్ష్య, కలహం, మత్సరము, క్రోధం, కక్ష, భేదం, అసూయ మొదలగునవి మరణ నియమాలు. ప్రేమ జీవనియమము. జీవము దేవుని స్వభావము, దేవుని శాశ్వతస్థితి. మరణము సాతాను స్వభావము, సాతాను శాశ్వతస్థితి.

దేవుని కుమారులుగ మనము జీవము కలిగి యున్నాము. కాని జీవమును ఇంకను స్వతంత్రించుకొనలేదు (1 కొరింథి 15:50-55). పరిశుద్ధాత్మ మనలో వసించుచు, వాక్యముద్వారా జీవ మార్గములో నడిపించుచున్నాడు. మృతుల పునరుత్థానం, అంత్యతీర్పు అనంతరం జీవమును స్వతంత్రించు కొందుము. అది మన విశ్వాసక్రియలపై ఆధారపడి యున్నది (మత్తయి 25:31-43). శరీరానుసారమైన మనస్సు మరణము, ఆత్మానుసారమైన మనస్సు జీవము (రోమా 8:5-6).

"శరీరేచ్ఛలనుబట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంట కోయును. ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్య జీవమను పంట కోయును" (గలతీ 6:8).

—సత్యానందం, రాజమండ్రి.

---

క్రైస్తవ కీర్తన పుస్తకములు వలయువారు సత్యవాణి కార్యాలయమునకు వ్రాసి వెంటనే పొందండి.

# నీవు చూచేదెవరిని? ఒక దొంగనా లేక క్రీస్తునా?

## *(Do you Look to a Thief or the Christ?)*

అతడు "ఆయనను చూచి-యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను. అందుకాయన వానితో - నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను" (లూకా 23:42, 43). కొందరు ఈ వాక్యభాగాన్ని చూపించుచు బాప్తిస్మము పొందకుండుటకు కారణములను వెదుకుచున్నారు. బోధకులు సిలువపైనున్న దొంగనుగాక, సిలువ మీదనున్న క్రీస్తును చూపించినయెడల వారికి మేలు.

## యేసు చెప్పినది....

యేసు అపొస్తలుల కిట్లు చెప్పెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్షవిధింపబడును" (మార్కు 16:15, 16). నమ్మి సిలువపైనున్న దొంగను చూచువాడు రక్షింపబడును అని ఆయన చెప్పలేదు. సిలువపైనున్న దొంగ బాప్తిస్మము పొందలేదు గనుక "నమ్మి బాప్తిస్మము పొందనివాడు రక్షింపబడును" అని ఆయన చెప్పలేదు.

యేసు సిలువవేయబడినప్పుడు నిజానికి సిలువపై చనిపోయిన యిద్దరు దొంగలుండిరి (లూకా 23:32). మొదట వాళ్ళిద్దరు యేసును నిందించిరి (మత్తయి 27:44). గాని వారిలో ఒకడు మారుమనస్సు నొందాడు. రెండవ దొంగను గద్దించాడు (లూకా 23:40). మనిద్దరము సిలువవేయబడుట న్యాయమే యని వానికి చెప్పాడు. "మనకైతే యిది న్యాయమే; మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాముగాని యీయన ఏతప్పిదమును చేయలేదని" అతడు చెప్పాడు (లూకా 23:41). అతడు యేసునుగూర్చి సత్యమే చెప్పాడు గనుక అతడాయనను బాగుగా ఎరిగి యుండవచ్చును.

నిజంగా యేసు ఏతప్పిదము చేయలేదు. నజరేయుడైన యేసును గూర్చి చనిపోవడానికి సిద్ధంగాయున్న ఒక దొంగకూడ సాక్ష్య మిచ్చాడు. ఒక నేరస్థుని నోటినుండి ఈచక్కటి మాటలు వచ్చాయి: యేసు నిర్దోషి! ఆయన పాపరహితుడు!

యేసుతోకూడ చనిపోయిన నేరస్థులలో ఒకడు మారు మనస్సు పొందాడు. మారుమనస్సుపొందిన యితడు చనిపోవకముందు యేసుతో, "యేసూ, నీవునీరాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసు కొనుమనెను" (లూకా 23:42).

సిలువపై చనిపోయిన ఈనేరస్థుని ఉదాహరణనుబట్టి బాప్తిస్మ మునుగూర్చి బైబిలు చేయు బోధనంతటిని వ్యర్థముచేయ ప్రియ త్నించు బోధకులు సాకులు చెప్పనవుసరం లేదు. ఈనేరస్థుడు క్రైస్తవ యుగంలో జీవించలేదు. 'నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందు వని' యేసు అతనితో చెప్పుసరికి మోషేయుగం ఇంకా అంతమొంద లేదు. ఆయనకు తోచినట్లు మనుష్యులను రక్షించడానికి యేసు శక్తిని కలిగియుండెను. క్రీస్తు మరణించిన తరువాతనే ఆయన శాసనము అమలులోనికి వచ్చెను (హెబ్రీ 9:16,17).

## క్రీస్తు చట్టంలో....

క్రీస్తు చట్టంలో పాపక్షమాపణపొందే షరతులు అపొ. కా. 2:38లోను, తదితర వచనములలోను కనబడును. పెంతెకొస్తునాడు విశ్వసించినవారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని పరిశుద్ధాత్ముడు వారికి చెప్పెను. సిలువపై రక్షించబడిన దొంగను చూపిస్తూ ఎన్ని సాకులు చెప్పినను, నమ్మిన వారు మారు మనస్సుపొంది పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంద వలెనను ఆజ్ఞ ఇంకా నిలిచేయున్నది.

క్రీస్తు పునరుత్థానము తరువాత మొదటి పెంతెకొస్తు దినము క్రైస్తవ యుగారంభ దినము. ఆ దినమందు మొట్ట మొదటిగా

సువార్త ఆయన నామమందు ప్రకటించబడెను (లూకా 24:47). పాపివైన మిత్రుడా, రక్షణకొరకు సిలువపై నున్న దొంగను గాక క్రైస్తవ యుగంలో అమలులో యున్న రక్షణ మార్గమును చూడుము. నీవు క్రీస్తువైపు చూడు. నీ విశ్వాసమును ఆయనయందుంచు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును" అని ఆయన చెప్పిన దానిని విశ్వసించి, ఆ యాజ్ఞలకు లోబడుము.

—బేసిల్ ఓవర్టన్.

---

సంక్షిప్త ప్రసంగము:

## మంచివాడు సంఘము వెలుపల రక్షింప బడగలడా?

## *(Can a Good man be Saved out of the Church?)*

పరిచయము:

1. మంచివాడొకడు డినామినేషన్‌లో లేకుండా రక్షింప బడగలడా? అనేది మన ప్రశ్న కాదు.
2. సంఘము అన్నప్పుడు క్రీస్తుసంఘము అనేది మన ప్రశ్న.

**A.** సాధారణంగా అందరూ అనుకొనేది:

1. మంచి నైతిక ప్రవర్తన చాలు, పరలోకం వెళ్ళడానికి.
2. మంచి పౌరుడుగా ఉంటే దేవుడు సంతోషిస్తాడు. అది ఆయనకు చాలు.
3. దాన ధర్మాలు చేస్తే పరలోకం చేరుకోవచ్చు.

**B.** క్రైస్తవుడు కాని ఓ మంచివానిని బైబిలు చూపించుచున్నది (అపొ. కా. 10).

1. అతడు భక్తిపరుడు
2. దేవుని భయం గలవాడు
3. ధర్మ కార్యములు చేయువాడు
4. ప్రార్థన పరుడు
5. దేవుడతని ప్రార్థనల నాలకించాడు.
6. అతడు దేవుని దూతను చూచాడు.

అయితే యితడు దేవునికి లోబడాలి. క్రీస్తునందలి విశ్వాస విధేయతలను ఏదీ మార్చలేదు. వాటి స్థానాన్ని ఏదీ తీసి వేయ లేదు.

C. మంచివాడొకడు సంఘము వెలుపల రక్షింపబడగలిగితే, అప్పు డేమిటి?

1. అట్లయితే లోకములో వుండే రక్షింపబడవచ్చు! సంఘము పిలువబడిన సంస్థ (2 థెస్స 2:14; 1 పేతురు 2:9; 1 యోహాను 2:15, 16).
2. అట్లయితే విమోచన దొరకదు: ఎఫెసీ 1:7; కొలస్స 1:14; రోమా 6:4; 1 కొరింథి 12:13.
3. క్రీస్తు శరీరం వెలుపల యుందుము. ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:13.
4. సమాధాన ముండదు 2 కొరింథి 5:19; ఎఫెసీ 2:15, 16.
5. రక్షకుడు లేక యుందుము. ఎఫెసీ 5:23; శిరస్సులేక యుందుము. ఎఫెసీ 1:22.
6. దేవుని కుటుంబానికి వెలుపల, ఆయన బిడ్డకాకుండా యుందుము. 1 తిమో 3:15; క్రీస్తును లేకుండా యుందుము.

ముగింపు:

1. సంఘమునకు వెలపల రక్షింప బడగల్గితే, క్రీస్తు సంఘాన్ని ఎందుకు స్థాపించాడు?
2. క్రొత్త నిబంధన ప్రకారం క్రైస్తవుడనగా యేమిటో క్రీస్తు సంఘసభ్యుడవడంకూడా అంతే.
3. నీ వెక్కడ ఉన్నావు? క్రీస్తు సంఘములోనా? లేక క్రీస్తు సంఘము కానిదానిలోనా?

---

యేసును వెంబడించిన పండ్రెడుగురు-6

## బర్తొలొమయి: 12 మంది అపొస్తలులలో ఒకడు

## *(Bartholomeu: The place of the twelve among the Apostles )*

ఈ లోకములో దేవుని వింతవలె అపొస్తలులు క్రొత్తనిబంధన సంఘారంభములో చాల ప్రముఖపాత్రను వహించిరి. యుగయుగములు నిలిచి యుండబోవు సంఘమునకు పునాది వేయు ఏకైక పని వారి కప్పగించబడెను. వారు తిరిగి లేచిన ప్రభువును చూచిన సాక్షులు గనుక, సంఘవిశ్వాసమునకు వారి సాక్ష్యము నిరంతరము ఒక లంగరు వలె నిలిచియుండును. ప్రభువుచే పంపబడినవారు గనుక అపొస్తలులు సమస్త జనములకు సువార్తను ప్రకటించుటకు బయలు వెళ్ళిన మిషనరీలు. వారు ప్రభువుయొక్క ప్రత్యేక ప్రతినిధులవలె ఆయన ఆత్మ నడిపింపు చొప్పున పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబడిన విశ్వాసమును (బోధను) నెలకొల్పిరి. దాని క్రమశిక్షణను భంగముచేసిన వాని నెవనినైనను శిక్షించుటకు వారు సంసిద్ధులుగా యుండిరి. (అపొ. కా. 15; 2 కొరింథి 13:1-10; అపొ. కా. 5:1-11).

యేసు అపొస్తలులు పండ్రెండుమంది ఒక ప్రత్యేకస్థానమును కలిగియున్నారు. యేసుయొక్క సువార్త సేవలో వారు ఆయనచే ఏర్పరచుకొనబడిరి. అపొస్తలుడగువాడు పునరుత్థానుడైన ప్రభువును కన్నార చూచినవాడై యుండుట అత్యవసరం గనుక ప్రభువు పునరుత్థానుడయ్యే వరకు వారు అపొస్తలుల అర్హతను సంపూర్తిగ కలిగిన వారుకాదు (అపొ. కా. 1:21-22; 1 కొరింథి 9:1). యేసు పునరుత్థానుడైన తరువాతనే సువార్తను ప్రకటించుచు ముందుకు వెళ్ళే ఆజ్ఞను అపొస్తలులకిచ్చెను. దానిపై సంఘము నిర్మించబడింది (మత్తయి 28:16-20). అందువలన ఆ 12 మంది భావిలో తమపని కొరకు సిద్ధపడునట్లు ఏర్పరచుకొనబడిన వారని గమనించవలెను. ఇస్కరియోతు యూదా ఖాళీచేసిన స్థలాన్ని నింపవలసిన అగత్యతలో, వారి సంఖ్య 12 మందికే పరిమితం చేయబడుట ఒక యాక్సిడెంటు కాదు (అపొ. కా. 1:15). ఇశ్రాయేలీయులు 12 గోత్రముల సాంప్రదాయంలో ఈ సంఖ్య వేరు పాతుకు పోయింది. ఈ పండ్రెండు మందిని నియమించుటలో ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానములను బలపర్చుట కనబడుచున్నది. సంఘము పాతః బంధనయొక్క నెరవేర్పుఫలితమే యని అది తెలియ జేయుచున్నది (రోమా 3:31; మత్తయి5:17).

## పౌలు, మత్తీయ మొదలగువారు

పురాతన సంఘములో ఈ పండ్రెండుమంది మాత్రమే అపొస్తలులుకారు. ఇస్కరియోతు యూదా స్థానాన్ని భర్తీచేసిన మత్తీయ ఉన్నాడు. అన్యజనులకు నియమింపబడిన గొప్ప అపొస్తలుడగు పౌలును మనం మరచిపోరాదు. మనం బాగాయెరిగిన పేరేగాక క్రొత్త నిబంధనలో మరికొందరు అపొస్తలులు కనబడుచున్నారు. బర్నబా, అంద్రొనీకు, యూనియ అనువారు ప్రసిద్ధికెక్కిన అపొస్తలులు (రోమా 16:7; అపొ. కా. 14:14). అట్లే మన ప్రభువు సహోదరుడైన యాకోబు, బహుశ సీలా కూడ అపొస్తలులే. (గలతీ1:19; 1థెస్స

2:6). బహుశా ఇంకా కొంతమంది ఉండియుండవచ్చును. (1 కొరింథి 15:7).

### బర్తొలొమయిని గూర్చి స్వల్పమే ఎరుగుదుము

అపొస్తలుల జాబితాలో బర్తొలొమయిని ఒక పేరుగా మాత్రమే మనం ఎరుగుదుము. నతనియేలే బర్తొలొమయి అని కొందరు చెప్పుదురు గాని దానికి ఆధారములులేవు. యోహాను సువార్తలో బర్తొలొమయి పేరు మనకు కనబడదు. మిగిలిన సువార్తలలో నతనియేలు పేరు మనకు కనబడదు. ఫిలిప్పుకు సన్నిహిత మిత్రుడు నతనియేలని యోహాను కనబరుచుచున్నాడు. అయితే ఈ పండ్రెండుగురి జాబితాలో మూడుచోట్ల ఫిలిప్పుతరువాత బర్తొలొమయి పేరు మనకు కనబడుచున్నది. యాకోబు, మత్తయి, అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయి, కనానీయుడైన సీమోను పేర్లనుకూడ యోహాను వ్రాసియుండలేదు. బర్తొలొమయిని గూర్చి నిజానికి మనకు తెలిసింది యేమీలేదు. అయితే యిదేసంగతి కనీసం సగంమంది అపొస్తలులను గూర్చి చెప్పుకో వచ్చును.

పెంతెకొస్తు తరువాత కొంత కాలమువరకే అపొస్తలుల పరిచర్యను అపొస్తలుల కార్యముల గ్రంథము మనకు తెలియజేయుచున్నది. వారు కొంత కాలమువరకు యెరూషలేములో యుండి కృషి సల్పినట్లు కనబడుచున్నది. అపొస్తలుల కియ్యబడిన పనిని బట్టి యిది వింతగా యుగుపడునుగాని, స్థానికంగా సువార్త పని బలపడునట్లు, బాల్యదశలో యుండి త్వరితగతిని వ్యాపించుచున్న సంఘాన్ని పటిష్ఠం చేయుట కొరకు బహుశా వారు యెరూషలేములో యుండిరి. పౌలు రెండవసారి యెరూషలేము వెళ్లినప్పుడు ఆ పండ్రెండు మందిలో ఇంచు మించు అందరు వివిధ ప్రాంతములకు తరలిపోయిరి. అటువాత రెండవ శతాబ్దపు ప్రారంభకాలం వచ్చువరకు వారిని గూర్చి మనం ఏమీ తెలిసికొనలేము. అయితే క్రీస్తు నామము ఎక్కడ ప్రకటింపబడలేదో

అక్కడ ఆయనను గూర్చి సాక్ష్య మిచ్చుటకు, ఆయన సంఘమును వివిధ ప్రాంతాల్లో నెలకొల్పుటకు వారు ఆయా ప్రాంతములకు బయలు దేరి పోయిరని చెప్పుకొనుట యుక్తమే.

—J. J. రాబర్ట్.

## దేవుడు నమ్మతగినవాడు

మనుష్యులు మోసము చేయగలరు. పక్షపాతము చూపించ గలరు. అబద్ధమాడగలరు. స్థిరబుద్ధి లేకుండా ఉండగలరు. వారు వాగ్దానము చేసిన దానిని మరచిపోగలరు. కాని మన ప్రభువును సృష్టికర్త అయిన దేవుడు చేసిన వాగ్దానమును ఎన్నటికిని మరచిపోడు, అబద్ధ మాడడు, పక్షపాతి కాడు, నమ్మతగినవాడు గనుక దావీదు ఇట్లు చెప్పెను. "మనుష్యులను నమ్ముకొనుటకంటె యెహోవాను ఆశ్రయించుట మేలు" (కీర్తనలు 118:8). పాత నిబంధనలో దేవుడు చేసిన వాగ్దానములను యేసుక్రీస్తులో ఆయన నెరవేర్చెను. అపొస్తలుడైన పౌలు మాటలు విందము: "దేవుడు యేసును లేపి, పితరులకు చేసిన వాగ్దానమును మన పిల్లలకు నెరవేర్చియున్నాడని మేమును మీకు సువార్త ప్రకటించుచున్నాము. అలాగే నీవు నాకుమారుడవు నేడు నేను నిన్ను కంటిని అని రెండవ కీర్తనయందు వ్రాయబడియున్నది" (అపొస్తులుల కార్యములు 13:32,33). దేవుడు ఏవిషయము చెప్పెనో అది ఆయన నెరవేర్చును. దేవుడు తన వాక్యమును నెరవేర్చును.

"కాబట్టి నీ దేవుడైన యెహోవా తానే దేవుడనియు, తన్ను ప్రేమించి తన ఆజ్ఞల ననుసరించి నడుచుకొనువారికి తన నిబంధనను స్థిరపరచువాడును వేయి తరములవరకు కృపచూపువాడును నమ్మ తగిన దేవుడనియు, తన్ను ద్వేషించువారిలో ప్రతివానిని బహిరంగ ముగా నశింపజేయుటకు వానికి దండన విధించువాడనియు నీవు తెలిసి కొనవలెను. ఆయన తన్ను ద్వేషించువాని విషయములో ఆలస్యము చేయక బహిరంగముగా వానికి దండన విధించును. (ద్వితీయోపదేశ

శాంతము 7:9-10). ఆయనను ప్రేమించి లోబడినవారికి బహుమానము ఇచ్చుటకు దేవుడు నమ్మతగినవాడు; అట్లు చేయనివానికి శిక్ష విధించుటకు ఆయన నమ్మతగినవాడు. దేవుడు పాపమును అసహ్యించుకొనును కాని ఆయన మనలను ప్రేమించును. మనలను క్షమించమని దేవుని అడిగినయెడల ఆయన మనలను క్షమించును. మనము నిష్కపటమైన హృదయములు కలిగియుండవలెనని ఆయన మనలను కోరుచున్నాడు. మన తప్పిదములనుండి కాపాడవలెనని మనము దేవుని అడుగవలెను. ప్రతి తప్పిదము పాపము "ఆజ్ఞాతిక్రమము పాపము" (1 యోహాను 3:4). మనము చేయు తప్పిదములనుగూర్చి దేవుడు ఇష్టపడడు. మనము తప్పుచేయునప్పుడు తల్లిదండ్రులు శిక్ష విధింతురు. అలాగే దేవుడుకూడ శిక్ష విధించును. సొలొమాను ఇట్లు చెప్పెను: "తండ్రి తనకు ఇష్టుడైన కుమారుని గద్దించురీతిగా యెహోవా తాను ప్రేమించువారిని గద్దించును" (సామెతలు 3:12).

## వాగ్దానములను నెరవేర్చువాడు

దేవుడుచేసిన వాగ్దానమును ఆయన నెరవేర్చును. అపొస్తలుడైన పేతురు ఇట్లు చెప్పెను: "కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమునుగూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీయెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3:9). మనము పరిశుద్ధులుగాయుండవలెనని దేవుడు మనలను కోరుచున్నాడు. "ఈవిధముగా దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు వారసులైనవారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్దేశించినవాడై, తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులనుబట్టి, మన ఎదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్దానమునుదృఢపరచెను. ఈనిరీక్షణ నిశ్చలమును,స్థిరమునై..."

(హెబ్రీయులకు 6:13-19). మనము ఆయనను ప్రేమించి ఆయనకు లోబడవలెను. దావీదు సొలోమానుకు చేసిన వాగ్దానము మనది: "నీవు బలముపొంది ధైర్యము తెచ్చుకొని యీపని పూనుకొనుము, భయపడకుండుము, వెరవకుండుము, నాదేవుడైన యెహోవా నీతో కూడ నుండును. ఆయన నిన్ను ఎంతమాత్రము విడువక యుండును..." (1 దినవృత్తాంతములు 28:20). "నిత్యజీవమును గూర్చిన నిరీక్షణతో కూడిన భక్తికి ఆధారమగు సత్యవిషయమైన అనుభవజ్ఞానము నిమిత్తము, అబద్ధమాడనేరని దేవుడు అనాదికాలమందే వాగ్దానము చేసెను" (తీతు 1:2) "మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు" (1 కొరింథి 1:9).

"నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మిక యుంచుము" (సామెతలు 3:5). యెషయా యెహోవాయందు నమ్మికయుంచెను. "ఇదిగో నా రక్షణకు కారణభూతుడగు దేవుడు నేను భయపడక ఆయనను నమ్ముకొనుచున్నాను..." (యెషయా 12:2). పౌలు చెప్పిన మాటలు జ్ఞాపకముంచుకొందము: "...సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగ దయచేయు దేవునియందే నమ్మిక యుంచుడని ఆజ్ఞాపించుము" (1 తిమోతి 6:17). "...దేవుడు నమ్మతగినవాడు, మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1 కొరింథీ 10:13). దావీదు ఇట్లు పలికెను. "యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము, బాధకలుగు నప్పుడు ఆయనే వారికి ఆశ్రయదుర్గము. యెహోవా వారికి సహాయుడై వారిని రక్షించును. వారు యెహోవా శరణుజొచ్చియున్నారు గనుక ఆయన భక్తిహీనుల చేతిలోనుండి వారిని విడిపించి రక్షిం

చును" (కీర్తనలు 37:39-40). పౌలు ఇట్లు చెప్పెను: "మనుష్యుల కందరికి రక్షకుడును, మరి విశేషముగా విశ్వాసులకు రక్షకుడునైన జీవముగల దేవునియందు మనము నిరీక్షణ నుంచియున్నాము గనుక ఇందునిమిత్తము ప్రయాసముతో పాటుపడుచున్నాము" (1 తిమోతి 4:10).

—యస్. వి. రావు, అయినాపురం.

---

## బాప్తిస్మము పొందుటకు 7 కారణములు
## *(7 Reasons for Bible Baptism)*

**1.** అది ఆజ్ఞాపింపబడెను: "యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని (అతడు) ఆజ్ఞాపించెను" (అపొ.కా. 10:48). దేవుని ఆజ్ఞలకు లోబడుట అత్యావుసరము. క్రీస్తు తనకు విధేయులైన వారందరికి నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5:8, 9).

**2.** క్రీస్తు దానినిగూర్చి బోధించెను: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16). క్రీస్తు బోధించిన దానిని మనము వినవలెను. "కాబట్టి యీ నామాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును" (మత్తయి 7:24).

**3.** అపొస్తలులు దానిని ప్రకటించిరి: పౌలు కొరింథులో ప్రకటించినప్పుడు "కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ. కా. 18:8). పెంతెకొస్తునాడు పేతురు యూదుల కిట్లు ప్రకటించెను: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ. కా. 2:38).

4. అదొక విశ్వాసక్రియ: మీరు బాప్తిస్మమందు ఆయనతో
కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవు
ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతోకూడ లేచితిరి
(కొలస్స 2:12). ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయో
జనకారియగును (గలతీ 5:6). దేవుని వాక్యము చెప్పురీతిగ బా
స్మమునకు లోబడి దేవునియందలి విశ్వాసమును కనుబరచుదుము.

5. క్రీస్తు శరీరములో అది మనలనుంచును. "మనమందరము
ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి
(1 కొరింథి 12:13). మనము శరీరములోనికి బాప్తిస్మము పొందియున్న
యెడల, బాప్తిస్మము పొందని వారు క్రీస్తు శరీరమైన సంఘమునకు
వెలుపల యున్నారు.

6. పాపికిని రక్షణకును మధ్య అదియున్నది: అననీయ సౌలుతో
ఇట్లనెను: "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామ
మునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసి
కొనుము" (అపొ. కా. 22:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము
ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3:21).

7. దానిద్వారా క్రీస్తును ధరించుకొనగలము: "యేసుక్రీస్తు
నందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు
క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని
యున్నారు" (గలతీ 3:26, 27). క్రీస్తును ఎంతమంది ధరించుకొన్నారు
క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినంతమంది! అంతకు ఎక్కువగా
తక్కువగాని కాదు. నీవు క్రీస్తును ధరించు కొన్నవా?

## క్రీస్తును అంగీకరించుట యెట్లు?

### *( How Does one Receive Christ ? )*

"కావున మీరు ప్రభువైన క్రీస్తు యేసును అంగీకరించిన
ముగా ఆయనయందు వేరుపారినవారై ... నడుచుకొనుడి" (కొల

2:6, 7). కొలస్సయులు క్రీస్తును అంగీకరించినట్లు పౌలు ఇక్కడ చెబుతున్నాడు. అయితే వారు క్రీస్తును ఎట్లు అంగీకరించారు? క్రీస్తును అంగీకరించు నీవు రక్షింపబడతావు అని ఈరోజుల్లో అనేకులు చెబుతున్నారు గనుక ఈ ప్రశ్న చాల ముఖ్యమైనది.

కొలస్సయిలో ఉన్న క్రైస్తవులు క్రీస్తునందున్నారని పౌలు చెప్పాడు (కొలస్స 1:1). వారు క్రీస్తు రాజ్యములో వున్నారని అతడు చెప్పాడు (1:13). వారు ఒకే శరీరములో యుండిరి (3:15). ఆ ఒకే శరీరమే క్రీస్తు సంఘము (1:18). క్రీస్తు రక్తముద్వారా విమోచన క్రీస్తునందున్నది (1:14). క్రీస్తులో యుండుట ఆయన సంఘములో యుండుటతో సమానము (1:1; 1:18; 3:15).

కొలస్సయిలో ఉన్న క్రైస్తవులు బాప్తిస్మమునందు పాతిపెట్టబడి దానినుండి లేపబడిరి (2:12). లేఖనార్థమైన బాప్తిస్మము పొందుట ద్వారా ప్రజలు క్రీస్తులోనికి ప్రవేశింతురు (రోమా 6:3; గలతీ 3:27). గనుక కొలస్సయి క్రైస్తవులు క్రీస్తులో ప్రవేశించు నిమిత్తము బాప్తిస్మమందు పాతిపెట్టబడిరి. బాప్తిస్మము పొందకముందు వారు క్రీస్తు దేవుని కుమారుడని నమ్మవలెను. ఆయనయందు వారు నమ్మిక ముంచాలి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, ప్రభువునందు తమ విశ్వాసాన్ని మనుష్యుల యెదుట ఒప్పుకోనాలి, పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందాలి (అపొ. కా. 2:38). కొలస్సయిలోని ప్రజలు ప్రభువు చెప్పిన ఈ మాటలకు లోబడి ఆయన నంగీకరించారు. కొలస్సయులు ప్రభువు నంగీకరించిన విధ మిదియని పౌలు చెప్పుచున్నాడు. నీవు ప్రభువు నంగీకరించావా? లేని యెడల కొలస్సయుల మాదిరి ననుసరించి ఈరోజే ఆయన నంగీకరించుము. ఈ విషయంలో సహాయ పడుటకు స్థానిక క్రీస్తు సంఘస్థుల నెవరినైనా సంప్రదించండి. లేదా మాకు తెలియజేయండి.

★

## బైబిలు వంటిది ఇంకోటి లేదు !

### ( No Book Like it )

"అరవై సంవత్సరాలకంటే పైగా బైబిలునుబట్టి నా జీవితాన్ని నడిపించుకొన్నాను. అటువంటి గ్రంథము ఇకోటి యేదీలేదు. అది సాహిత్యం యొక్క అద్భుతం, గొప్ప జ్ఞాననిధి, ఆశ్చర్యముల కాశ్చర్యం, మర్మాలకు బయల్పాటు, మానవ ప్రవర్తనకు దోషరహిత మార్గదర్శి, వర్ణించలేని ఆదరణకు మూలం.

దాని నగౌరవపంచే వారి మాటల నేమీ లెక్కచేయ వద్దు! వారు జ్ఞానం లేనివారై అట్లు చెబుతారు. అది దేవుని వాక్యం. అది నడిపించు రీతిగా దానిని చదువు. దాని సూత్రాలను బట్టి నడుచుకో. దాని వర్తమానాన్ని విశ్వసించు. దాని ఉపదేశముల ననుసరించు. బైబిలు నెరిగినవాడెవడు విద్యాహీనుడు కాదు. దాని ఉపదేశముల నెరుగని వాడెవడు జ్ఞాని కాదు".

—సేమ్యూల్ చాద్విక్.

---

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA-533 001

H/KD-45/KD H.O.

Printed Book only

To

..........................................

..........................................

..........................................

..........................................